ప్రజాశక్తి

సోమవారం 30 సెప్టెంబర్ 2024 5 విజయనగరం



స్వర్ణాంధ్ర విజన్‌పై
నేడు ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలో రూపొందించనున్న స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్రం రూపకల్పనకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా, మండల స్థాయి దార్శనిక పత్రాల రూపకల్పన కోసం జిల్లాలోని మంత్రి, ఎమ్‌పి, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, రైతులు, సమాజంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వర్తక వాణిజ్య సంఘాల ప్రతినిధులు, తదితరుల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు.

సందడే సందడి

- అబ్బురపర్చిన సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆలోచింపజేసిన మ్యాజిక్ షో
- అలరించిన నాటికలు
- రెండో రోజూ పోటెత్తిన జనం
- స్టూడెంట్ ఫెస్ట్‌కు పెరిగిన ఆదరణ
- నేటి రాత్రితో ముగింపు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థి

ఓ వైపు విద్యార్థుల పరస్పర కరచాలనం... యువతీ, యువకుల విన్యాసాలు.. విజ్ఞానం విరజిల్లే సైన్స్ ఎగ్జిబిషన్. చిన్నారుల చిరునవ్వుల కేళి.. అబ్బుర పర్చిన నృత్య ప్రదర్శనలు.. సాంఘిక దురాచార నిర్మూలనపై రక్తి కట్టించే నాటికలు.. ఆలోచింపజేసిన మ్యాజిక్‌షో.. ఇలా ఎన్నో విశేషాలతో స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియం సందడిగా మారింది. యువత ఉత్సాహం, ఉల్లాసం, కేరింతలకు ఈ ప్రాంగణం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్‌కు రెండోరోజు ఆదివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తాకిడి మరింత పెరిగింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, విజయనగరంటౌన్

నగరంలోని గురజాడ కళాభారతి ఆడిటోరియంలో డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ ఆదివారం రెండోరోజుకు చేరుకుంది. ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆలోచింపజేసింది. మరోవైపు ఆటపాటలతో ఫెస్ట్ సాగింది. కొందరు విద్యార్థులు సినీ పాటలకు బ్రేకు డ్యాన్సులు వేయగా, మరికొందరు సంప్రదాయ నృత్య విన్యాసాలతో సభికులను కట్టిపడేశారు. ఇంకొందరు జానపదాలకు నృత్యరూపకం కట్టారు. కొందరు తల్లిదండ్రులు కూడాఉత్సాహంగా పాటలు ఆలపించారు. 'జాగ్రత్త నా చిట్టితల్లి... జింక వేషాలు వేసే సింహాలు ఉంటాయి' అంటూ ఓ విద్యార్థిని తల్లి పాడిన గేయం.. నేటి సమాజంలో మహిళలపై దాడులను, అత్యాచారాలను ఎలా ఎదుర్కోవాలో నేర్పింది. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపైనా విద్యార్థులు ఆటపాటలు, నాటికల రూపాల్లో తెలియజేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. డ్యాన్స్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఈపు విజయ్ కుమార్, చంద్రిక, ఆర్.సూర్యపాత్రో వ్యవహరించారు.

ఫెస్ట్‌ని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి ఎ.అజశర్మ, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ప్రభాత్, రాష్ట్ర నాయకులు వి.రాజగోపాల్, సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ చీకటి దివాకర్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, ఈశ్వరరావు, శ్రీనివాస్, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు తదితరులు సందర్శించారు.





నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రాయితీపై పుస్తకాలు

ఫెస్ట్‌లో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనలో మహనుబావుల జీవిత చరిత్ర మొదలుకుని, భారతదేశ చరిత్ర వరకు, వివిధ ప్రముఖులు రచించిన పుస్తకాల నుంచి విద్యార్థులకు అవసరమయ్యే పోటీపరీక్షల పుస్తకాల వరకు రాయితీపై అందుబాటులో ఉంచారు.



ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం

ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు కొత్తకొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. గణిత, భౌతిక శాస్త్రాలలో లోతైన అవగాహన పెంచేలా ప్రాజెక్టులను ఆవిష్కరించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రదర్శనలను వీక్షించారు.



నేటితో ముగియనున్న ఫెస్ట్

స్టూడెంట్ ఫెస్ట్ సోమవారం రాత్రితో ముగియనుంది. ఇప్పటి వరకు ఒక లెక్క.., సోమవారం మరో లెక్క అన్నట్టుగా బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఫెస్ట్ నిర్వాహకులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్, జిల్లా కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. జనరంజకమైన కార్యక్రమాలతోపాటు ఈ ఫెస్ట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న వారికి ముగింపు సభలో భాగంగా జ్ఞాపికలు అందిస్తామని చెప్పారు.

అదుర్స్.. చంద్రయ్య మ్యాజిక్ షో

ఫెస్ట్‌లో భాగంగా జనవిజ్ఞాన వేదిక మెజీషియన్ ఎన్.చంద్రయ్య ప్రదర్శించిన మ్యాజిక్‌షో విద్యార్థులతోపాటు సభికులందర్నీ విశేషంగా ఆకట్టుకుంది. ప్రకృతికి విరుద్ధంగా ఏవీ జరగవని, అలా జరిగినట్టు ఎవరు చూపించినా అది అభూత కల్పనలేనని విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కొన్ని రసాయనాల కలయిక ద్వారా నీరు, ఇసుక నుంచి అగ్గి తీయడం, మండుతున్న అగ్గిని నోటితో ఆర్పడం, స్వచ్ఛమైన నీటిని రంగు నీళ్లుగా మార్చడం, మరుగుతున్న నూనెలోని బజ్జీలను చేతితో తీసినా కాలకపోవడం వంటి ఎన్నో మ్యాజిక్‌షోలు చేయడంతో పాటు అవన్నీ ఏయే రసాయనాల కలయిక ద్వారా సాధ్యమయ్యాయనే విషయాలను వివరించారు. వీటినే కొందరు మహిమలుగా చిత్రీకరించి జనాన్ని మోసం చేస్తున్నారని, ఇటువంటి మూఢనమ్మకాలు పెంచేవారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు చంద్రయ్య సూచించారు.



మంటలను ఆర్పడంపై మ్యాజిక్‌షో ద్వారా అవగాహన కల్పిస్తున్న జెవివి మెజీషియన్ చంద్రయ్య



డ్రగ్స్ వల్ల అనర్థాలపై వీధి నాటిక ద్వారా అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఐ బృందం



డ్రగ్స్ వల్ల మహిళలపై జరుగుతున్న అకృత్యాలను నృత్య ప్రదర్శన ద్వారా వివరిస్తున్న గరివిడి విద్యార్థినులు



సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై
దశల వారీగా పోరుబాట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం దశల వారీగా పోరాటం చేయనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం యుటిఎఫ్ ఉత్తరాంధ్ర జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నగరంలోని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని రకాల సదుపాయాలను మున్సిపల్ టీచర్లకు కల్పించాలని దీర్ఘకాలిక పోరాటాలు చేశామని గుర్తుచేశారు. పిఎఫ్, అప్‌గ్రేడ్, ప్రమోషన్లు, బదిలీల సమస్యలు నేటికీ కొనసాగుతున్నాయని, వీటిని తక్షణం పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎజి, డిఎంఎ.. ఒకరిపై మరొకరు నెట్టుకుంటూ మున్సిపల్ టీచర్ల పిఎఫ్ సమస్యను జాప్యం చేస్తున్నారని తెలిపారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించి, ప్రస్తుతం మున్సిపల్ శాఖ ఖాతాలో ఉన్న పిఎఫ్ డ్రా చేసుకునే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, అప్‌గ్రేడేషన్ ఇతర సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ రెండో తేదీన అన్ని మున్సిపాలిటీల్లో సత్యాగ్రహ దీక్షలు చేస్తామని తెలిపారు. అప్పటికి రాష్ట్ర విద్యాశాఖ స్పందించకుంటే అక్టోబరు 17న జిల్లా కేంద్రాల్లో నిరాహార దీక్షలు, 24న రాష్ట్ర కమిషనర్ కార్యాలయం వద్ద 24 గంటల ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఆర్.మోహన్‌రావు, ఎస్.కిశోర్ కుమార్, వి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జిఒ 3ను పునరుద్ధరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, తక్షణమే ఆ జిఒను పునరుద్ధరించి, గిరిజన హక్కుల్ని కాపాడాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మాధ్యమాలను కొనసాగించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

మున్సిపల్ టీచర్ల సమస్యలపై వినతి

మున్సిపల్ టీచర్ల సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యాన డిఇఒ ప్రేమ్‌కుమార్‌కు ఆదివారం వినతి అందించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెఆర్‌సి పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ఎన్.సత్యనారాయణ, సిహెచ్ తిరుపతినాయుడు విజయనగరం మున్సిపల్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకటరావు, పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లాకు క్రీడా పాఠశాల

త్వరలో కబడ్డీ, ఖోఖో అకాడమి : శాప్ ఎమ్‌డి గిరీశ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో త్వరలో క్రీడా పాఠశాల ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని శాప్ ఎమ్‌డి గిరీశ పిఎస్ హామీ ఇచ్చారు. ఖోఖో, కబడ్డీ అకాడమీని కూడా ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని డిఎస్‌డిఒను ఆయన ఆదేశించారు. ఆదివారం జిల్లాలో శాప్ ఎమ్‌డి పర్యటించారు. విజ్జి స్టేడియంలో నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజుతో క్రీడాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభానికి సిద్ధం చేయడానికి కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో పనులు దాదాపు పూర్తయ్యాయి. దీంతో ఈ స్టేడియం అమ్మవారి పండుగ నాటికి ప్రారంభించాలని, అక్టోబరు పదో తేదీలోగా అప్పగించాలని శాప్ ఇంజినీర్లను ఎమ్‌డి ఆదేశించారు. స్టేడియంలోని బాక్సింగ్ రింగ్‌కు అవసరమైన పరికరాలను అందజేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు జెడ్‌పి అతిథి గృహం వద్ద ఆయనను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్‌డిఒ కీర్తి కూడా ఉన్నారు. ఈ పర్యటనలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, విశాఖ క్రీడాభివృద్ధి అధికారి జూన్ గాలియట్, సిపిడబ్ల్యు ఇంజినీర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే, శాప్ అధికారులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్‌డి గిరీశ

విశాఖ ఉక్కును రక్షించుకుందాం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ స్టీల్ కర్మాగారాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పార్టీలకతీతంగా అందరిపైనా ఉందని జన విజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంవిఆర్ కృష్ణాజి తెలిపారు. ఆదివారం నగరంలో ఓ ప్రయివేట్ పాఠశాలలో ఉత్తరాంధ్ర ప్రజల సంస్థ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అక్టోబర్ 2న విశాఖలో చేపట్టే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఉత్తరాంధ్ర బిసి అసోసియేషన్ ప్రెసిడెంట్ నీల తిలక్, రాష్ట్ర నిరుద్యోగ సంఘం ప్రెసిడెంట్ ఎస్.హేమంత్, బిసి సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి గొర్లె సూరిబాబు, ఉత్తరాంధ్ర ప్రజల సంస్థ జిల్లా కన్వీనర్ రమేష్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు అనుకూలంగా మద్యం పాలసీ చేయాలి

విజయనగరం టౌన్ : నూతన మద్యం పాలసీ కల్లు గీత కార్మికులకు అనుకూలంగా తేవాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.అప్పారావు, సిమ్మ అప్పారావు కోరారు. ఆదివారం స్థానిక యువజన వసతిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చే మద్యం షాపులు కల్లుగీత సొసైటీల ద్వారా ఇవ్వాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు జి.ఎర్నిదేముడు, దమ్ము బంగారయ్య, సిమ్మ దేముడు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

విజయనగరంటౌన్ : ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా అయ్యన్నపేట జంక్షన్‌లో ఉన్న మదర్ తెరిసా కిడ్స్ స్కూల్లో మదర్ తెరెసా సేవా సంఘం అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు సాయికుమార్, శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రవికుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సేవా సంఘం గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వరరావు, సంఘ సభ్యులు శ్రావణి, కీర్తన, తనీష్, శివదీప్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి 'జుగా'

ప్రజాశక్తి-విజయనగరంకోట

గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జన్‌జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి మోడీ అక్టోబరు 2న వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రారంభించనున్నట్లు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. ఆదిమ గిరిజన తెగలు నివసించే దేశంలోని 100 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారని, అందులో విజయనగరం జిల్లా కూడా ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని శృంగవరపుకోట, గంట్యాడ, బాడంగి, బొబ్బిలి, బొండపల్లి, గజపతినగరం, గరివిడి, జామి, తెర్లాం, వేపాడ, మెంటాడ మండలాల్లో గిరిజనులు నివసించే గ్రామాల్లో ఈ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని చెప్పారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియం నుంచి జిల్లాకు చెందిన గిరిజనులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ప్రధానమంత్రి నిర్వహించే ఆన్‌లైన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు.

ప్రతీ ఇంట్లో సౌర విద్యుత్తు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతీ ఇంట్లో సౌర విద్యుత్తు వినియోగించుకొనే విధంగా వినియోగదారులు చైతన్యవంతులు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 300 యూనిట్ల విద్యుత్తు వినియోగించే గృహాలుగా అందర్నీ చైతన్యపరిచి సోలార్ ఎనర్జీని ఉత్పత్తి చేయడమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి
పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషిచేసే గాదె శ్రీనివాసులునాయుడికి మరోసారి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య కోరారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు దఫాలు ఉపాధ్యాయుల సమస్యలపై శ్రీనివాసులు కృషిచేశారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడారు. అనంతరం పిఆర్‌టియు ఉత్తరాంధ్ర సదస్సు జరిగింది. కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర నాయకులు గిరిప్రసాద్ రెడ్డి, వి.కరుణానిధిమూర్తి , గోపీనాథ్, వైరి అప్పారావు, రవీంద్రనాయుడు, శ్రీనివాస్, ఆర్.రాంబాబు పాల్గొన్నారు.

నేడు మహిళా గర్జన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలో సోమవారం చేపట్టే మహిళా గర్జన ర్యాలీని విజయవంతం చేయాలని మహిళా గర్జన కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక ఒక ప్రయివేటు హోటల్లో మహిళా గర్జన కమిటీ, వాజీ చానల్ సంయుక్త ఆధ్వర్యాన మహిళా గర్జన ర్యాలీ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కోట వద్ద ప్రారంభించే ర్యాలీలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ పాల్గొంటారని మహిళా గర్జన కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వాజీ ఛానల్ ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు, మహిళా గర్జన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విక్రమ్‌కి ఘన స్వాగతం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరి తొలిసారి విజయనగరం వచ్చిన అవనాపు విక్రమ్, భావన దంపతులకు ఆ పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆదివారం స్థానిక వై జంక్షన్ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి కూడా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆశయాలు చూసి పార్టీలో చేరినట్లు తెలిపారు. నగరంలో, జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.



బైక్ ర్యాలీతో రోడ్‌షోగా వస్తున్న ఎమ్మెల్యే మాధవి, అవనాపు విక్రమ్, భావన,

రూ.50 లక్షలతో పైడితల్లమ్మ జాతరకు ఏర్పాట్లు

యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా కృషి ● 'ప్రజాశక్తి'తో విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య ముఖాముఖి

అక్టోబర్ 14, 15వ తేదీల్లో జరిగే పైడితల్లమ్మ జాతరకు నగర పాలక సంస్థ నుంచి సుమారుగా రూ.50 లక్షలతో సౌకర్యాలు కల్పిస్తున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. పండగకు వచ్చే యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు అందించడం కోసం నగర పాలక సంస్థ ద్వారా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. పైడితల్లమ్మ పండగ ఏర్పాట్లు గురించి, తీసుకుంటున్న చర్యల గురించి అందులో వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

\- ప్రజాశక్తి, విజయనగరం టౌన్





పైడితల్లమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు ఏ విధంగా చేస్తున్నారు.?

పైడితల్లమ్మ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేలా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు ఇప్పటికే అన్ని శాఖల సహకారంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తున్నాం. ఇంజినీరింగ్, ప్రజారోగ్య, టౌన్‌ప్లానింగ్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్తు.. ఇలా అనేక శాఖల అధికారులతో సమావేశాలు ఏర్పాటుచేశాం. శాఖా పరంగా చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటున్నాం.o

పారిశుధ్య నిర్వహణపై తీసుకున్న చర్యలేమిటి.?

పండగ మూడు రోజులు సుమారుగా నాలుగు లక్షల వరకు బయట నుంచి యాత్రికులు వచ్చే అవకాశం ఉంది. దీంతో అదనంగా మూడు రోజులకు గాను 450 మంది ప్రయివేటు శానిటేషన్ సిబ్బందిని తీసుకుంటున్నాం. ఆలయం చుట్టూ, నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించనున్నాం. మూడు షిఫ్టుల్లో పనులు చేయనున్నారు. అదే విధంగా సిరిమాను వెంట 100 మంది వరకు పారిశుధ్య సిబ్బంది పని చేయనున్నారు. భక్తులు వేసే అరటి పళ్ల ఎప్పటికప్పుడు తీసి, రోడ్డును శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం.

నగరంలో రోడ్లు గుంతలమయంగా మారాయి, రోడ్ల బాగుకు చేపట్టిన చర్యలు ఏమిటి.?

హుకుంపేట నుంచి సిరిమాను వచ్చే రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభించాం. ఈ రోడ్డు పనులు రూ.12.40 లక్షలతో చేపడుతున్నాం. పనులు చివరి దశకు వచ్చాయి. రోడ్డు ప్యాచ్ వర్క్‌లు రూ.6.60 లక్షలతో చేస్తున్నాం.

యాత్రికులకు ఎటువంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.?

పైడితల్లమ్మ ఉత్సవాలకు వచ్చే యాత్రికులకు నగరంలో 20 ప్రాంతాల్లో తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. పండగ మూడు రోజులపాటు తాగునీరు కుళాయిల ద్వారా అన్ని డివిజన్లకు సరఫరా చేస్తాం. కుళాయిలు లేని ప్రాంతాలకు రోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేస్తాం.

నగరంలో ప్రత్యేక ఆకర్షణగా ఉండేందుకు చేపడుతున్న చర్యలు.?

పండగ వైభవం తెలిపే విధంగా నగరంలో ఉన్న కూడళ్లలో ప్రత్యేక విద్యుత్తు అలంకరణలు ఏర్పాటుచేస్తున్నాం. విగ్రహాల వద్ద లైటింగ్ ఏర్పాటు చేస్తాం. 12 పాయింట్ల వద్ద హోర్డింగులు, 11 ప్రాంతాల్లో స్వాగత ద్వారాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తాం.

సిరిమాను తిరిగే ప్రాంతంలో ఎన్ని శిథిలావస్థ భవనాలు ఉన్నాయి.? సిరిమానోత్సవంలో మీరు తీసుకున్న జాగ్రత్తలు ఏమిటి.?

సిరిమాను మూడు లాంతర్ల నుంచి కోట జంక్షన్ వైపు తిరిగే రోడ్డులో 12 భవనాలు శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించాం. సిరిమానోత్సవం సందర్భంగా భవనాల పైకి ప్రజలు వెళ్లకుండా నోటీసులు పెడతాం. పైకి ఎవరూ ఎక్కకుండా నియంత్రించే విధంగా చర్యలు తీసుకుంటాం.

జంగిల్ తొలగింపు

ప్రజాశక్తి - వేపాడ



పిచ్చి మొక్కలను తొగిస్తున్న జెసిబి

మండలంలోని చామలా పల్లి సర్పంచ్ కోలా సతీష్ ఆదివారం బడి బస్సు రాకపోకలకు ఆటంకం లేకుండా చామలాపల్లి గ్రామం నుంచి దబ్బిరాజుపేట వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్స్‌ను, చెట్ల కొమ్మలను జెసిబితో తొలగించారు. ఇటీవల ఆర్‌టిసి ట్రయిల్ రన్ వేసినపుడు రోడ్డుకు ఇరువైపులా జంగిల్స్ ఉన్నాయని ఇలా ఉంటే బస్సు రావడం ఇబ్బందని చెప్పడంతో ఎట్టకేలకు గ్రామ సర్పంచ్ స్పందించి రోడ్డు కిరివైపులా ఉన్న దట్టమైన పొదలను, చెట్ల కొమ్మలను తొలగించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - తెర్లాం

పిల్లలు చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, కాళీ సమయంలో చదవడం రాయడం నేర్చుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో పిల్లలచే పలు కథలు పిల్లలు చదివించడం, రాయించడం చేశారు. క్విజ్ పోటీలు నిర్వహించి పిల్లలకు బహుమతులు అందజేశారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నివారించండి

ప్రజాశక్తి- రేగిడి



అవగాహన కల్పిస్తున్న పద్మ

ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ పద్మ కోరారు. అంబఖండిలో ఆదివారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం అనేక రుగ్మతలకు మూల కారణమన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి గ్రీన్ అంబాసిడర్‌లకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి తడి పొడి చెత్తను వేరుచేసి చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలని అంబాసిడర్లకు సూచించారు.

పారిజాతం మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బెహరా చెరువు రహదారి పక్కన పుట్టిన రోజున పది మొక్కలు నాటుదాం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బొబ్బిలి హృషీకేశ్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటడంతో పాటు అదనంగా వంద పారిజాతం మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. పుట్టినరోజున పది మొక్కలు నాటడాన్ని సాంప్రదాయంగా అందరం పాటిద్దామని జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి, వాసవీ క్లబ్ వనితా ప్రాంతీయ కార్యదర్శి వి.సుశీల, లగుడు సత్యం, పి.శ్రీనివాస రావు, టి.వంశీ, యస్.హర్ష తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆధ్యాత్మిక సంస్థ సేవకు రూ.4వేలను వి. నాగేశ్వరరావుకు విరాళంగా అందజేశారు.

శివశంకర్‌ను కలిసిన జనసేన నేతలు

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్ర ఎంఎస్ఎంఇ డవలప్‌మెంట్ చైర్మన్‌గా నియమితులైన జనసేన రాష్ట్ర కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌ను జనసేన నియోజకవర్గ ఇంచార్జి జి. అప్పలస్వామి, జనసైనికులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఎస్ఎంఇ ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పి.మనోజ్ కుమార్, ఎం.దనుంజయ్, జనసైనికులు పాల్గొన్నారు.


బేబినాయనకు కృతజ్ఞతలు చెప్పిన సిఎం

ప్రజాశక్తి- బొబ్బిలి

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సిఎం సహాయ నిధికి విరాళాలు ఇచ్చిన ఎమ్మెల్యే బేబినాయన, మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజాకు ట్విట్టర్‌లో సిఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. వరద బాధితులు కోసం ప్రజలు, టిడిపి కార్యకర్తలు నుంచి సేకరించిన రూ.73లక్షలను చంద్రబాబుకు అందజేసిన విషయం తెలిసిందే.

గోతులమయంగా సిసి రహదారి

ప్రజాశక్తి - భోగాపురం



గోతులమయమైన సీసీ రోడ్డు ఇదే..

భోగాపురంలోని వివిధ ఆలయాలకు వెళ్లే సిమెంటు రహదారి వర్షాలకు గోతులమయంగా మారింది. దీంతో ఆలయాలకు వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవలి వర్షాలకు పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న మంచినీటి కోనేరు పూర్తిగా నిండిపోయింది. దీంతో కోనేరు గట్టు నుంచి వస్తున్న ఊట నీరు సిమెంట్ రహదారిపైకి నిత్యం వస్తోంది. ఈ రహదారిలో ఓ ప్రైవేట్ పాఠశాల ఉండడంతో పాఠశాల బస్సులు వెళ్లేందుకు వేరే రహదారి లేక ఈ రహదారి నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో రహదారి గోతులమయంగా మారినట్లు చెబుతున్నారు. గట్టుకు ఆనుకొని కాలువను తవ్వి ఊట నీటిని మళ్లించి ఉంటే లక్షలు పెట్టి నిర్మించిన సిమెంట్ రహదారి గోతుల మయంగా తయారయ్యేది కాదని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి సిమెంటు రహదారిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం కోట

విద్యార్థుల్లో ఉండే ప్రతిభను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని డిప్యూటీ డిఇఒ వెంకటరావు తెలిపారు. ఆదివారం స్థానిక పిఎస్ఆర్ స్కూల్లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన సందర్శించారు. ఇందులో 450 మంది విద్యార్థులు 150 ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఆనందమూర్తి, స్కూల్ కరస్పాండెంట్ పాకలపాటి సన్యాసిరాజు, ప్రిన్సిపల్ జి.ఎస్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



రోగితో మాట్లాడుతున్న వైద్యుడు

150 మందికి గుండె పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో ఆదివారం 150 మందికి ఉచితంగా గుండె సంబంధిత పరీక్షలు చేశారు. కార్డియాలజిస్టు శరత్ కుమార్ పాత్రో ఆధ్వర్యంలో డాక్టర్ బి.రవికిశోర్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ చంద్రకుమారి, డాక్టర్ రాజేష్ ఈ శిబిరంలో పరీక్షలు చేశారు. అనంతరం తిరుమల మెడికవర్ కాన్సరెన్సు హాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శివరాం గుండె సమస్యలపై సందేహాలను నివృత్తి చేశారు. తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఎమ్‌డి డాక్టర్ కె.తిరుమల ప్రసాద్, ఆసుపత్రి సెంటర్ హెడ్ ఎన్.మల్లికార్జున రెడ్డి, డాక్టర్ షరిన భట్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బేస్‌బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

అండర్-14, 17 విభాగాల్లో బాల, బాలికల బేస్‌బాల్ ఎంపిక పోటీలు బాడంగి హై స్కూల్లో సోమవారం నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు పట్టుకొని హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9440089001 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

1న ఫెన్సింగ్ జట్టు ఎంపిక

అక్టోబర్ ఒకటో తేదిన గంట్యాడ హై స్కూల్ మైదానంలో ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కృష్ణంరాజు తెలిపారు.

1న స్విమ్మింగ్ పోటీలు

అండర్-14, 17 విభాగాల్లో స్విమ్మింగ్ ఎంపిక పోటీలు అక్టోబర్ ఒకటో తేదిన విజయనగరంలోని ఆక్వా కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు కృష్ణంరాజు తెలిపారు.

కేంబ్రిడ్జ్ చదువులు..నారాయణ వసూళ్లు

●చదువు ఒకచోట వసూళ్లు మరోచోట ●నారాయణలో చేరిన పిల్లలకు కేంబ్రిడ్జ్‌లో పాఠాలు ●తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న విద్యాశాఖ

నేటి సమాజంలో విద్యతో వ్యాపారం చేస్తున్నారనేందుకు నిదర్శనం పట్టణంలోని కేంబ్రిడ్జ్ స్కూల్. ప్రభుత్వం దృష్టిలో కేంబ్రిడ్జ్ పాఠశాలగానూ ప్రజల దృష్టిలో నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థగానూ రూపాంతరం చెంది మోసగిస్తున్న తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. చాలా మంది తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో చదివించాలన్న ఆశతో నారాయణలో చేర్పించారు. అయితే వీరిలో చాలా మంది నారాయణలో కాకుండా కేంబ్రిడ్జి స్కూల్లోకి తీసుకొచ్చి పాఠాలు చెబుతున్నారు. ఫీజులు వసూళ్లు నారాయణలో చేస్తే పాఠాలు మాత్రం కేంబ్రిడ్జి పాఠశాలలో సాగడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండల కేంద్రంలో ఉన్న కేంబ్రిడ్జ్ పాఠశాలను మూడేళ్ల కిందట నారాయణ విద్యాసంస్థల పేరుతో ఒప్పందం చేసుకొని పాఠశాల వ్యవహారాలు అన్నీ నారాయణ విద్యాసంస్థల పేరుతో నడుపుతున్నప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం ఇంకా కేంబ్రిడ్జ్ పాఠశాలగా చలామణి అవుతుంది. గతంలో కేంబ్రిడ్జి పాఠశాలగా ఉన్న సమయంలో విద్యార్థుల నుంచి తక్కువ ఫీజులు వసూలు చేస్తూ విద్యను అందించేవారు. ఇప్పుడు నారాయణ స్కూల్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఏటా ఫీజులు, బుక్స్, యూనిఫామ్, షూస్ ఇలా ప్రతి ఒక్కటీ నారాయణ స్కూల్ పేరుమీద విక్రయిస్తూ ఐఐటి కోచింగ్, గేమ్స్, ఇతర శిక్షణల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు ముక్కు పిండి మరి వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.



నారాయణ పేరిట తిరుగుతున్న బస్సులు

ఈ విషయమై పాఠశాల ఎజిఎం శ్రీనివాస్‌ను ప్రజాశక్తి ప్రశ్నించగా ప్రభుత్వం దృష్టిలో ఇది కేంబ్రిడ్జి పాఠశాలని ప్రజల దృష్టిలో నారాయణ కార్పొరేట్ విద్యాసంస్థల పాఠశాలగా వ్యవహారాలు నడిపిస్తున్నట్లు ఆయన ఖరాఖండీగా చెబుతున్నారు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆ స్కూల్ పై చర్యలు తీసుకునే స్థాయి నాది కాదు: ఎంఇఒ

హైస్కూల్స్‌పై అజమాయిసీ డిప్యూటీ డిఇఒకు ఉంటుంది. పట్టణంలో గల ఈ పాఠశాల కేంబ్రిడ్జి స్కూల్ పేరు మీదే ఉంది. నారాయణ విద్యాసంస్థలు పేరుతో అధిక ఫీజులు వసూల్ చేసిన బుక్స్, యూనిఫామ్, షూస్ వంటివి విక్రయించినా, నారాయణ స్కూల్ పేరుమీద బస్సులు నడిపినా, నారాయణ కార్పొరేట్ స్కూల్ ఫీజుల స్ట్రక్చర్‌ను అమలు జరిపినా చట్టపరమైన చర్యలు ఉంటాయి. కానీ అవి డిప్యూటీ డిఇఒ మాత్రమే చేయగలరు.

నర్సింగరావు, ఎంఇఒ, ఎస్‌కోట.



కేంబ్రిడ్జి పాఠశాల భవనంపై ఏర్పాటు చేసిన నారాయణ స్కూల్ కటౌట్

మండల న్యాయ సేవ కమిటీ చైర్‌పర్సన్ స్పందించాలి

గతంలో ఓ ప్రైవేట్ స్కూల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదు పై మండల న్యాయ సేవ కమిటీ చైర్‌పర్సన్, జూనియర్ సివిల్ కోర్టు జడ్జ్ సబ్బవరపు వాణి స్పందించి వసూలు చేసిన అధిక ఫీజును తిరిగి బాధితులకు ఇప్పించారు. పట్టణంలోని నారాయణ స్కూల్ యాజమాన్యం చేస్తున్న ఆగడాలను మండల న్యాయ సేవ కమిటీ చైర్‌పర్సన్ స్పందించి చర్యలు తీసుకోవాలి.

మద్దిల రమణ సిపిఎం మండల కార్యదర్శి, ఎస్‌కోట

అధ్వానంగా రహదారులు

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే బైపాస్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, గొల్లపల్లి నుంచి తెర్లాం రోడ్డు, బాడంగి రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి శ్రీదాడితల్లి ఆలయం వరకు రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వర్షం కురిస్తే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. పిరిడి జంక్షన్, అలజంగి సమీపంలో రోడ్లపై గోతులు ఉండడంతో లారీలు కూరుకుపోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో రైల్వే స్టేషన్ వెళ్లే ప్రయాణికులు, ఆటో కార్మికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రంగరాయపురం నుంచి జె.రంగరాయపురం వరకు రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో ప్రయాణికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పాడైపోయిన రోడ్లు బాగు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



వర్షం పడితే బొబ్బిలి పట్టణంలో రహదారి పరిస్థితి



అధ్వానంగా ఆకులకట్ట నుంచి పినపెంకి వెళ్లే రహదారి

పారాది బ్రిడ్జి తెచ్చిన తంటా అధ్వానంగా రహదారులు

బాడంగి: మండలంలోని ఆకులకట్ట నుంచి పినపెంకి వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఈ రహదారిలో వెళ్లే స్కూల్ విద్యార్థులు, వాహనదారులు, ప్రజలు బురదలో నీళ్లల్లో వెళ్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడటం వల్ల విద్యార్థులు వాహనదారులు ఎక్కడ గొయ్యి ఉందో ఎక్కడ రహదారి ఉందో తెలియని పరిస్థితుల్లో గోతుల్లో పడి గాయపడుతున్నారు. ప్రతి రోజు ఎక్కడో ఒక దగ్గర లారీలు దిగిపోతున్నాయి. రోడ్డు మధ్యలో కూరుకుపోతున్న లారీలను లాగాలంటే బొబ్బిలి, సాలూరు నుంచి క్రేయిన్‌లు రావాల్సి వస్తుంది. వీటికి కూడా ఒక్కో వాహనాన్ని బయటకు తీసేందుకు రూ. 8వేల నుంచి రూ. 12 వేలు వరకూ వసూలు చేస్తున్నట్లు వాహదారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

రాకపోకలకు తప్పని ఇబ్బంది

వేపాడ: మండలంలోని సింగరాయి గ్రామస్తులు చినుకుపడితే చాలు.. రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. గ్రామం నుంచి బయటకు వెళ్లాలంటే మొలనోతు నీటిలో దిగి వెళ్లాల్సి రావడమే అందుకు కారణం. వాహనాల రాకపోకలకు కూడా అవకాశం ఉండటం లేదు. సింగరాయి గ్రామం నుంచి నిత్యం విశాఖపట్నం కూలి పనులకు వెళ్తే తప్ప కుటుంబాన్ని పోషించుకోలేని పరిస్థితి. అలాంటి పరిస్థితిల్లో రోజూ నీటిలో దిగి ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోంది.



ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు (ఫైల్)

గ్రామానికి చెందిన తమ్మయ్య చెరువు రోడ్డును ఆనుకుని ఉండటం, దాని అలుగు వద్ద మొలలోతు ఉండటంతో ఆ నీటిలో దిగి వెళ్లాల్సి వస్తుంది. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను కబ్జా చేసి ఫెన్సింగ్ వేయడం వల్ల నీరు బయటకు వెళ్లకుండా చెరువు అలుగు వద్ద రోడ్డుపై నిల్వ ఉండిపోతోంది. దీంతో గ్రామస్తులు ఆ నీటిలో దిగే ప్రయాణించాల్సి వస్తోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సౌకర్యం కల్పించకపోతే తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని గ్రామస్తులు నిరుజోగి కామేష్, గుమ్మడి దేవుడి బాబు, గేదెల కనకరావు, గేదెల సంతోష్, బోని రమేష్, గేదెల దేముడు హెచ్చరించారు.

గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి..

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని ఆకులసీతంపేట రోడ్డు, ఆతవ జంక్షన్ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో ఈ రోడ్లు గుండా ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నారు. రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు పడటంతో భారీ వాహనాలు అందులో దిగిపోయి అవస్థలు పడుతున్నాయి. రోడ్లు బాగుచేయడంపై ఆర్‌డబ్ల్యుఎస్ డిఇని వివరణ కోరగా ఖజానాలో డబ్బులు లేవని నిధులు మంజూరు చేస్తే తప్ప రోడ్లును బాగుచేయలేమని చెప్పారు.

ముమ్మరంగా ప్రధాన రహదారి పనులు

ప్రజాశక్తి- రాజాం

పట్టణం పరిధిలో గల రాజాం - పాలకొండ ప్రధాన రహదారి డోలాపేట (జిమ్మెర్ కాలేజీ) నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు రూ.6 కోట్లతో ప్రధాన రహదారి విస్తరణతో పాటు కల్వర్టు పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ పనులను శనివారం ఉదయం నుంచి ముమ్మరం చేశారు. కల్వర్టు పనులు వేగవంతంగా సాగుతున్నాయని అధికారులు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో రోడ్ల పనులు అనుకున్న స్థాయిలో చేపట్టకపోవడం, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిలిచిపోయాయి. ఈ రహదారి పనులు వేగవంతానికి కాంట్రాక్టర్ కృషి చేసి ప్రజల కష్టాలను తీర్చాలని పలువురు కోరుతున్నారు.



కల్వర్టు పనులు చేస్తున్న కూలీలు

టిసిల కోసం దరఖాస్తు.. తిరస్కరించిన హెచ్‌ఎం

ప్రజాశక్తి- బొబ్బిలి

సిబిఎం బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థుల తల్లిదండ్రులు టిసిలు కోసం దరఖాస్తు చేయగా ప్రధానోపాధ్యాయరాలు తిరస్కరించారు. సిబిఎం పాఠశాల గత 110 ఏళ్లుగా సిబిసిఎన్‌సి క్రిస్టియన్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తుంది. 2019 వరకు ఎయిడెడ్ పాఠశాలగా నడవగా వైసిపి ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలను ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించింది. ప్రైవేట్ యాజమాన్యం పాఠశాలను కోమటిపల్లి తరలించేందుకు పాఠశాల స్థలాన్ని ఒక ప్రైవేట్ విద్యా సంస్థకు ఇచ్చి కోమటిపల్లిలో ఆ విద్యాసంస్థకు ఉన్న స్థలాన్ని సిబిఎం పాఠశాలకు ఇస్తూ గతేడాది రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు. కోమటిపల్లికు పాఠశాలను తరలించేందుకు రిజిస్ట్రేషన్ రెన్యువల్ కూడా చేయలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు టిసిలు కోసం దరఖాస్తు చేసుకోగా ప్రధానోపాధ్యాయరాలు టిసిలు ఇప్పుడు ఇవ్వలేమని చెప్పడంతో తల్లిదండ్రులు నిరాశతో వెనుదిరిగారు.

టిసిలు తీసుకోవాలని బలవంతం చేయడం అన్యాయం

సిబిఎం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు టిసిలు తీసుకోవాలని తల్లిదండ్రులను బలవంతం చేయడం దుర్మార్గమని సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న, ఎం.శ్రీనివాస్, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. పాఠశాలను కోమటిపల్లి తరలించకుండా పట్టణంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాఠశాల రెన్యూవల్ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

ఆయాలకు బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- గజపతినగరం

గజపతినగరంలో స్కూల్లో పనిచేసే ఆయాలకు మూడు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. లక్ష్మి అన్నారు. ఆదివారం పాఠశాల వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి స్కూల్లో ఆయాలుగా పని చేస్తున్న కార్మికులకు రూ.6వేలు జీతం ఇస్తున్నారన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్కూలు దగ్గర ఉండి పని చేయాల్సి వస్తున్నా నెల నెలా జీతం సకాలంలో చెల్లించడం లేదన్నారు. దీంతో అప్పుల పాలై కుటుంబాన్ని నెట్టుకు రావడం కష్టంగా ఉందని, విద్య వైద్యం, ఇతర అవసరాలకు డబ్బులు సరిపోక చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పెరిగిన ధరలకనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నిచోట్ల రాజకీయ వేధింపులు పెరిగాయని మండలంలోని రామన్నపేట గ్రామంలో ఆయాగా పనిచేస్తున్న వెలగాడ జానకినీ వారం రోజుల నుంచి పనిలోకి రావద్దన్నారని సర్పంచ్ తల్లి ఎమ్మెల్యేతో ఫోన్ చేయించారని చెబుతున్నారని దీంతో ఆమె పరిస్థితి చాలా ఆందోళన కరంగా ఉందని గుర్తు చేశారు. రాజకీయ వేధింపులు తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎ.గౌరీ, వి.జానకి, పి. పైడిరాజు, ఏ.లక్ష్మి, ఎస్ లీల, ఎస్. మంగ, డి. రోజా తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఆయాలు, సిఐటియు నాయకులు

సంక్షేమ పథకాలు ప్రారంభించాలి

ప్రజాశక్తి- రాజాం

భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు వెంటనే ప్రారంభించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకరరావు కోరారు. ఇందులో భాగంగా అక్టోబర్ ఒకటిన లేబర్ ఆఫీసు వద్ద నిర్వహించనున్న ధర్నా జయప్రదం చేయాలని రాజాంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచంలో మట్టి పోసినట్లుగా అనేక సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికులకు అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలను గత ప్రభుత్వం ఆపేసిందన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఆపేసి ఇచ్చిన ఉత్తర్వులను చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే రద్దు చేసి వెంటనే సంక్షేమ పథకాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్టోబర్ 1న ఉదయం 10 గంటలకు రాజాం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ప్రదర్శన లేబర్ ఆఫీసు వద్ద ధర్నా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఏ జగన్మోహన్‌రావు, సిఐటియు రాజాం నియోజకవర్గం నాయకులు పోరెడ్డి విశ్వనాథం, మడపాన త్రినాద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

బదిలీల్లో పారదర్శకత ఏదీ?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో గ్రామ సచివాలయాల పరిధిలోగల పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో పారదర్శకత పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ నిబంధన మేరకు పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తున్నారో అర్థం కాక దూర ప్రాంతాల నుంచి వచ్చిన పంచాయతీ కార్యదర్శులు అవస్థలు పడుతున్నారు. ఇష్టారాజ్యంగా పంచాయతీ కార్యదర్శులను మార్పులు చేయడం, టిడిపి నాయకులకు నచ్చిన వారికి అందలం ఎక్కించడం నచ్చని వారిని మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయడం ఎంతవరకు సమంజసమని కొంత మంది పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధులకు డుమ్మా కొట్టిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం, కష్టపడి పని చేసే వారిని ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు న్యాయమంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వీరి బాధలను అర్థం చేసుకొని నిబంధన మేరకు బదిలీలు జరిపితే బాగుంటుందని పలువురు బహిరంగంగానే నొచ్చుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందామని ఎపిటిఎఫ్ 1938 మాసపత్రిక ఉపాధ్యాయ ప్రగతి ప్రధాన సంపాదకులు జి సత్యనారాయణ అన్నారు. అక్టోబరు 6,7,8 తేదీల్లో జగన్నాథ కల్యాణ మండంపలో జరగనున్న 20వ విద్యా వైజ్ఞానిక మహా సభల వేదిక ఏర్పాట్లును ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బిడ్డలు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకొనే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్రీయ, ప్రజాతంత్ర, కామన్ విద్యా విధానాన్ని అవలంబించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై సత్యం, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏ సదాశివరావు, ఉపాధ్యాయ ప్రగతి సంపాదకవర్గ సభ్యులు ఎ ఎస్ నాయుడు, ,రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బోధనేతర పనులతో విద్యకు ఆటంకం


ప్రజాశక్తి- బొబ్బిలి

పాఠశాలల్లో నిర్వహిస్తున్న బోధనేతర పనుల వల్ల విద్యాబోధనకు తీవ్ర ఆటంకం కలుగుతుందని తక్షణమే వాటిని ప్రభుత్వం నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించిన జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధనేతర పనులైన విద్యా ప్రవేశం, విద్యా ప్రవేశ 90డేస్, శిక్షా సప్తహ్, స్వచ్ఛత పక్వాడా, స్వచ్ఛతహి సేవ, స్వర్ణ ఆంధ్ర ఆడ బిడ్డను కాపాడుకుందాం, లిప్, తరల్, ఫిర్కీ, జోపితారా, ప్రసస్ట్, ఈ లక్ష్య లాంటి మరో 50 రకాల బోధనేతర పనులు పాఠశాలల్లో అమలవుతున్నాయని వీటితో విద్యాబోధన కుంటుపడటమే కాకుండా ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఇలాంటి బోధనేతర పనులను నిర్వహిస్తూ నాణ్యమైన విద్యాబోధన ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎలా అందించగలరని ఆయన ప్రశ్నించారు. ఒకే దేశం ఒకే విద్యా విధానాన్ని అమలు చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచన చేయాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు జోగినాయుడు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. వచ్చే ఫిబ్రవరి, మార్చ్ నెలల్లో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులను ఎన్నుకోవటానికి అర్హులైన ఉపాధ్యాయులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి మండల అధ్యక్షులు సిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య, రామకృష్ణ, లక్ష్మణరావు, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సిఐగా చిన్నంనాయుడు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి ఎక్సైజ్ సిఐగా పి.చిన్నంనాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పని చేసిన సిఐ మురళీధర్‌కు బదిలీ కావడంతో చిన్నంనాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఎస్‌ఐగా బొబ్బిలిలో పని చేశారు. నాటుసారా, గంజాయి, ఇసుక అక్రమ రవాణా, బెల్ట్ షాపులు నివారణకు చర్యలు తీసుకుంటామని చిన్నంనాయుడు చెప్పారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సిఐ

నేరాలు ఘోరాలు

తాళం వేసిన ఇంట్లో చోరి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని దేవుదల గ్రామంలో శనివారం అర్ధరాత్రి పాలవలస కృష్ణ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. పాలవలస కృష్ణ కాశీ పుణ్యక్షేత్రానికి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఊరు శివారులో ఉన్న తన డాబ ఇంటి వెనక కిటికీలు తీసి చోరీకి పాల్పడ్డారు. కృష్ణ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు ఆదివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పుణ్య క్షేత్రానికి వెళ్ళిన కృష్ణ కుటుంబ సభ్యులు వస్తే గాని ఎంత బంగారం, ఎంత నగదు, ఇతర వస్తువులు చోరీకి పాల్పడ్డాయో తెలియదని ఎస్ఐ పి. నీలావతి చెబుతున్నారు. క్లూస్ టీమ్‌తో విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కొండచిలువ హతం

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని యుద్ధ స్తంభం సమీపంలోని వాటర్ ప్లాంట్ వద్ద 10 అడుగుల కొండచిలువను స్థానికులు హతమార్చారు. వాటర్ ప్లాంట్ సమీపంలో కొండచిలువను గుర్తించి భయభ్రాంతులకు గురికావడంతో కర్రలతో కొట్టి చంపారు.